# 4 తారతమ్యాలు

రాత్రి ఒంటిగంట దాటినా సభాపతికి నిద్రపట్టలేదు. వెధవ సమస్యలు ఎంత దుంజుకున్నా ఒడ్డుపట్టక అతన్ని వేధిస్తున్నవి. పగలల్లా ఎంత తీవ్రంగా వాటిని ఎదుర్కొన్నా, ఎంత ఆవేదనము భరించినా తీరకపోవటం అలా వుంచి, రాత్రిళ్లు కూడా వేధిస్తూనే ఉన్నవి.

ఆరేళ్ళక్రితం తాను గడిపిన జీవితం గుర్తుకొస్తే అవుర్న ఏడవాలనిపిస్తోంది సభాపతికి. అప్పుడు తాను ఒక పెద్ద హోటల్‌లో కేవలం ఒక సర్వర్‌గా ఉండేవాడు. బ్రహ్మచారి-కనుక ఒంటరివాడు. ఉద్యోగానికి సంబంధించిన బాధ్యతలు మినహా మరెవ్వరికీ జవాబులు చెప్పవలసిన అవసరం కూడా తనకు లేదు. రెండు పూట్లా భోజనం, తాగినంత కాఫీ, తినగలిగినన్ని స్వీట్సూ, కారపు సరుకూను. ఇదిగాక రోజూ పై ఖర్చుకు పావలా బత్తెం; నెలకు ముప్పై రూపాయిల జీతమూను. అన్నీ గడిచి నెల తిరిగేప్పటికి చేతులో పడే ముప్పై రూపాయిలూ ఏంచేయాలో తోచని రోజులవి. మిగతా సర్వర్లు యజమానులపట్ల క్రోధద్వేషాలతో ఎందు కుంటారో, ఎందు కుండాలో అర్థంకాని దినాలవి. ఇంతకన్న బ్రహ్మాండమైన ఉద్యోగం తనకు దొరకదని భావించేవాడు. తన ఆదాయ-వ్యయ పట్టికలరీత్యా ఆర్థిక స్థితిని అంచనా వేస్తే భాగ్యవంతుల్లోనే లెక్క! ముఖ్యంగా పెద్ద కోర్కెలనేవి వేధించకుండటంవల్ల తృప్తికరమైన, హాయిని అనుభవించే జీవితాన్ని గడిపేవాడు తాను!

ప్రశాంతంగా మైదానంమీద ప్రవహించే నది హఠాత్తుగా లోయలోకి ఉరికి జలపాతమైన విధంగా తన జీవితంలో కూడా ఒక పెద్ద అఘాతం ఏర్పడింది. ఐతే అది అఘాతమనే విషయం ఇప్పుడుగాని బోధపడటంలేదు: తాను అమ్మ కడుపులో ఉండగా తన తండ్రి జూదగాడై, పూర్వీకుల ఆస్తి

అమ్మాడు; తాను మేజర్ కాగానే ఆ ఆస్తిమీద హక్కు ఉన్నదని ఎవ రెవరో చెప్పిందాన్ని బట్టి లాయర్లను కలుసుకున్నాడు. తప్పకుండా మైనర్ ఆస్తి రక్షణచట్టాన్ని అనుసరించి తనకు దక్కవలసిన సగభాగమూ గారంటీ చేశారు లాయర్లు. తన దగ్గిర నిలవవున్న వెయ్యి రూపాయలూ కోర్టు ఖర్చులు పెట్టుకోగా, అవతలి వాళ్ళు రాజీకి వచ్చి పదివేల రూపాయిలు తనకు ముట్టజెప్పారు. ఇంతటి అదృష్టం తనకు పట్టినందుకు, తన నెరిగిన వా రందరూ ఆ అదృష్టాన్ని గుర్తించగా, తనక్కూడా మహదానందం కలి గింది. ఐతే యీ హఠాత్ పరిణామంవల్ల తన జీవిత ప్రశాంతత భంగ పడింది.

పదివేల రూపాయిల రొఖ్ఖం దగ్గరుండగా కాఫీ హోటల్ సర్వర్‌గా జీవించవలసిన అవసరం తనకు లేదని తానే నమ్మాడు! అందుకని ముందుగా ఆ వెధవ ఉద్యోగానికి రాజీనామా యిచ్చి, తోటి సర్వర్ల ఈర్ష్యకు గురయ్యాడు.

'ఇప్పుడేం చేయాలి?' అనే ఆలోచనతో నెల రోజులు జల్సాగా తిరి గాక, మూలధనంలో ఐదు వందలు బొర్రపడిందని తెలుసుకొని, త్వరగా మేల్కొని- స్వయంగా ఒక చిన్న హోటల్ పెట్టి నడిపేందుకు నిశ్చయించు కున్నాడు.

ఈ ప్లాను బాగున్నదని తనను ఆశ్రయించిన మిత్ర బృందమంతా మెచ్చుకుంది. ముఖ్యంగా పాలవాళ్ళు వెంటపడి కావలసిన సరంజామా అంతా ఏర్పాటు చేశారు. మార్వాడీలు ఏ క్షణాన పైకం అవసరమైనా ఇస్తా మని నమ్మించారు. వీళ్ళందరి మాటలూ విని హోటల్ నడిపే ప్రయత్నం చేద్దామని మొదట్లో అనుకున్నాడు కాని-అంతకన్న తనకున్న పెట్టుబడితోనే ఆరంభించి, మంచి పునాది పడ్డాక, వ్యాపారాన్ని పెంపొందించవచ్చు లెమ్మని సరిపెట్టుకున్నాడు. గుడ్డిలో మెల్లగా తన విజ్ఞానాన్ని నిరూపించే మెట్టు ఇదొక్కటే ననే విషయం ఇప్పుడిప్పుడే బాగా అర్థమౌతోంది.

అద్దె కాస్త ఎక్కువైనా ట్రంక్ రోడ్డుమీద ఇల్లు దొరకటం ఎంతో మేలైంది. తప్పక సహాయపడతామన్న వారంతా సమయానికి తమ చేతకాని తనాన్ని నిరూపించారు. తాను తలపెట్టిన యీ చిన్న వ్యాపారానికి తన దగ్గిర ఉన్న పెట్టుబడి సరిపోతుంది కనుక తాను పుచ్చె కాచుకున్న వా డయ్యాడు;

స్వశ కిమీదనే ఆధారపడే తత్వమున్న కార్యశూరుడు కావటంవల్ల కాల యాపన లేకుండా 'సభాపతీ భవన్-లాడ్జింగ్ అండ్ బోర్డింగ్'ను ఆరం భించాడు.

మేనేజిమెంట్ మినహాగా మిగతా విషయాలన్నీ క్షుణ్ణంగా తెలిసిన వా డవటంవల్ల ఆరంభదశలోనే వ్యాపారం సవ్యంగా నడిచింది. చేతిలో ఉన్న పెట్టుబడి అంతా రొఖ్కరూపంనుంచి, వస్తురూపం దాల్చింది. ఐనప్ప టికీ పుష్కలంగా అప్పులిచ్చేవారు చుట్టూ ఉండబట్టీ, రొఖ్కపు బేరం సాగు తూండబట్టీ, ప్రతి సాయంత్రానికీ తాను ఇవ్వవలసినవారే కాని, తనకు ఇవ్వ వలసిన వారు ఉండటం లేదు.

అంతవరకూ బాగానే ఉన్నది. తనకు పట్టిన ఐశ్వర్యాన్ని గ్రహించి కొంతమంది పెద్దలు తమతమ కూతుళ్ళను వివాహానికి ఆఫర్‌చేయ నారం భించారు. యవ్వనదశను వృధాచేసుకుంటున్నా ననే జ్ఞానం తనకు కలిగి మనసు రెప రెప లాడింది. తన శ్రేయోభిలాషులు కూడా పెళ్ళిచేసుకోమని ఒత్తిడి తెచ్చారు. రోగి కోరిన పథ్యమే డాక్టర్‌కూడా సిఫార్సు చేసినట్లయి తాను పెళ్ళి చేసుకున్నాడు.

తన జీవితం పతనమయేందుకు అదే మొదలు! మొదట్లో దాంపత్య జీవితం మధురమైనదిగా కనిపించినా, ఆ వెనుక దాగిన 'చేదు విషం' రుచి ఆరంభమైంది. గాలికి తిరుగుతూండే బావమరదిగాణ్ని గల్లా పెట్టె దగ్గిర కూర్చోపెట్టి, వాడి అక్కతో సరససల్లాపాలలో కాలం వెళ్ళబుచ్చ నారం భించాక, ఆరు నెలలు గడిచేప్పటికి యీ శృంగారం తన మూలధనంలో సగాన్ని బలిగొన్న సంగతి తెలిపి, ఇదెంత ఖరీదైన వ్యవహారమో తెలిసి వచ్చింది. మిగతా సగమన్నా దక్కినందుకు సంతోషించి శృంగార వ్యవ హారాలకూ, వ్యాపార వ్యవహారాలకూ కేటాయించబడే కాలాన్ని విడివిడిగా నిర్ణయించి, బావమరిదిగాణ్ని తరిమి తానే మేనేజ్ చేసికో నారంభించాడు. ఐతే ఒక కాలు విరిగాక పూర్వపు వేగంతో నడవగలగటం ఎంత దుర్ల భమో అది తన అనుభవంలోకి వచ్చింది.

ఏమైనా పట్టువిడవకుండా నానా అవస్థా పడగా రెండు సంవత్సరా లలో ఇద్దరు పిల్లలకు తండ్రి కావటంతో, తన వ్యాపారపు పెట్టుబడిని కూడా

మూలధనపు స్థాయికి తీసుకొచ్చాడు. ఐతే కుటుంబపు ఖర్చు-ముఖ్యంగా డాక్టర్ల ఖర్చు విపరీతమై పోయింది. మామగారి ఇల్లు కూడా ఊళ్ళోనే ఉండటంవల్ల వారి సంసారం నెలకు పదిహేను రోజులు తన ఇంట్లోనే ఉండటం, మిగతా రోజుల్లో తన హోటల్ సరుకుల్ని పొట్టలు పగిలేట్లు తినడం మొదలైంది. మొదట్లో తాను లెక్కచేయకపోయినా, తన లాభాలను దిగమింగటంవరకూ వచ్చిందని తెలుసుకున్నాడు. కాని వీటిల్లో వేటినీ వొదిలించుకోలేని తన అసమర్థతను కూడా తెలుసుకున్నాడు.

మరో సంవత్సరం గడిచేప్పటికి ప్రపంచానికి వచ్చిపడిన మార్పుల కారణంగా తన వ్యాపారం దెబ్బతిన్నది. ట్రంక్ రోడ్‌లో తాను హోటల్ పెట్టేనాటికి ఉన్న హోటళ్ళ సంఖ్య పదింతలైంది! కొత్త హోటళ్ళు-మంచి ఫర్నిచర్‌తో. ఫాన్స్‌తో, ఎయిర్ కండిషన్స్‌తో టెలిఫోనులలో వెలిసినవి. వాటి పోటీకి తాను తట్టుకోవాలంటే కనీసం అరలక్షన్నా పెట్టుబడి ఉండాలి. వ్యాపారపు గుట్టు బైటపడకుండా ఏదోవిధంగా ఉన్నదాన్ని నడపటమే కష్టంగా ఉన్నది. ఏతావాతా తన హోటల్ మూడో తరగతి జనాభా వచ్చేదిగా రూపొందింది. దీన్ని అభివృద్ధి చేస్తే తప్ప ప్రయోజనం లేదు; అందుకు తగిన పెట్టుబడి లేనంతకాలం ఆ ఊహ ఎంత గొప్పదైనప్పటికీ నిష్ప్రయోజనం!

వ్యాపారంమీద గడించే లాభాలతో జీవితాన్ని సాగించటమే ఒక విషమ సమస్యగా తయారైంది. అనుభవంవల్ల తాను తెలుసుకున్న దేమంటే—ఎన్ని కష్టాలుపడ్డా వాటిని తానే భరించవలసి ఉంటుంది. ఇతరులకు చెప్పటంవల్ల తాత్కాలికంగా కొంచెం హృదయభారం తగ్గినా, వారెవరూ ఆర్చేదీ, తీర్చేదీ లేదు. పైపెచ్చు నలుగురి నోళ్ళా పడి, తాను అలుసైపోవటం, తన బండారం బైటపడ్డాక యీ సమాజం తనను తరిమి వేయడం దివాళాతీసి ఆ మొహాన్ని ఎక్కడ దాచాలో తెలియక నానా అవస్థ పడడం తప్పవు!

లాడ్జింగ్ 'రూమ్'ల మీద ఇదివరకైతే మొత్తం అద్దె వచ్చి నెలకో రెండొందలన్నా మిగిలేది. ఇప్పుడు యీ వెధవరూముల కొరకు ఎవ్వరూ రావటం లేదు. మంచాలూ, ఫానులూ, ఫర్నిచర్ మార్చాలంటే తనవల్ల

కాదు! పొరపాటున ఎవరైనా ఇక్కడ దిగినా, మర్నాడే ఖాళీ చేయటం, లేదా మరొకసారి రాకూడదని నిశ్చయించుకోవటం పరిపాటి.

ఇలా కాదని ఒకరాత్రి ప్రియురాలితో కులాసాగా గడిపేందుకు గాను రూములు అద్దె కివ్వటం సాగించాడు. ఈ వెధవపనికి తన మనస్సు అంగీకరించకపోయినా, ఏదోవిధంగా వ్యాపారాన్ని సాగించాలి కనుక కేవలం పరిస్థితుల ఒత్తిడికి లొంగిపొయ్యాడు. ఎప్పుడైతే ప్రయోజనం మారిందో వ్యాపారం బాగా సాగింది, పాసింజర్లకు అద్దెకివ్వటం శుద్ధదండు గనిపించింది; ఈ వ్యభిచార వ్యాపారంలో మూడు, నాలుగు రెట్లు అద్దె వస్తోంది. రూమ్ బాగా లేదని అనేవా ళ్ళెవ్వరూ లేరు. తెలతెలవారుతూండ గానే దులుపుకొని వెళ్ళేవాళ్ళకు ఫిర్యాదులు చేసే తీరిక ఎక్కడిది? ఇది వాటంగానే ఉన్నది.

ఐతే ఆరునెలలు తిరక్కుండానే పోలీసులు దాడిచేశారు. క్రిమినల్ కేసులో ఇరుక్కొని ఐదొందలు ఖర్చుపడి బైట పడవలసి వచ్చింది.ఆ దాడి భయంతో కాతాదారులు ఇటువైపుకూడా తిరిగి చూడటంలేదు. ఇటు పాసిం జర్లూ లేక, అటు అమ్మాయిల కొలుపూ లేకపోవటంతో తన పని మరీ ఇరకాటాన పడింది.

పుట్టినంతవరకూ అప్పులు తెచ్చాడు. ఒక మహా పర్వతం కింద కూర్చొని, భూకంపం వచ్చినట్టయితే తనమీద విరిగిపడే దేమిటో ఊహించు కొనే వ్యక్తి మన స్తత్వంలాటిది తనను పట్టి, పీడించి, పిండిపారేస్తోంది. సర్వర్ సభాపతిగా తాను అనుభవించిన ఆనందానికీ, యజమాని సభాపతిగా పొందే ఆవేదనకూ పోలిక ఎక్కడన్నా ఉన్నదా?బైటి ప్రపంచానికి మాత్రం తన యీ ప్రస్తుత పరిస్థితే గొప్పది—అదొక్కటే తన కిప్పుడు శ్రీరామ రక్షగా ఉన్నది.

తన యీ విషాద పరిస్థితులు తనకు మినహా ఇతరు లెవ్వరికీ తెలియక పోవటంవల్లనే భార్య 'నగలు లేవు—నాణాలు లేవు!' అని వేధిస్తూ ఉంటుంది; అంతేకాని ఒడుదుడుకులు లేకుండా సంసారం సాగిపోతోందని సంతోషించదు!

ఎంతవరకూ ఖర్చులు తగ్గించే అవకాశం ఉన్నదో అంతవరకూ

తగ్గించాడు. పెద్ద జీతాల సర్వర్లను తీసిపారేసి ఏ పదికో, పదిహేనుకో వచ్చేవాళ్ళను పెట్టాడు. మేడమీది పదిగదులకూ కలిసి ఒకే ఒక కుర్రాణ్ని పెట్టాడు. ఎప్పుడన్నా పొరపాటున వచ్చేజనానికి ఇంతకన్న సిబ్బందీ అనవసరం. గంతకు తగ్గ బొంత అన్నట్లు వాడికి—అదే, ఆ రూమ్‌బాయ్ శ్రీనివాసులికి, తన హోటలుకన్న మంచి హోటల్‌లో ఉద్యోగం దుర్లభం. ఉదయం ఆరు గంటలనుంచీ రాత్రి పదింటిదాకా అక్కడే పడి ఉంటాడు. వాడికి ఒక అక్కగారు మినహా మరెవ్వరూ లేరు. ఆ అక్కకు హోటల్‌లో కప్పులు కడిగే పని ఇప్పించాలని వాడు ప్రయత్నించాడు; కాని కారుచౌకగా వచ్చిన ఏనాదివాణ్ణి తీసేసేందుకు తనకే మనసొప్పలేదు.

అప్పులవాళ్ళు నలుగురూ ఒకేసారి మీదపడితే కట్టుగుడ్డలతో తాను వీధిన పడవలసి ఉంటుంది. ఆ పరిస్థితి రాకుండా ఏం చేయాలి?

ఇలాటి విషాద సంఘటనలమధ్య ఇరుక్కుపోయిన సభాపతికి తెల్లవారుజామున మూడింటిదాకా నిద్రపట్టక పోవటంలో ఆశ్చర్యమేముంది?

## 2

మనస్సులో దిగులు దిగులుగా ఉన్నా పైకి మాత్రం చిరునవ్వులు పొలకబోస్తూ బిల్లులు వసూలు చేసుకుంటూ కూర్చున్నాడు సభాపతి. 'పాపం పండి బద్దలవుతుంది' అనే సామెత తాను యెరుగు కాని. ఏ పాపమూ చేయని, చేయలేని తనకూ్కడా ఏదో బద్దలయి, జీవితమంతా చిన్నాభిన్నమయే సమయం దరిదాపుల్లోనే ఉన్న దనిపిస్తోంది. మాటిమాటికీ అంతరాత్మ ఘోషిస్తూ ఉంటే, ఆ మాటలు వినలేక, అంతరాత్మను వొదిలించుకోనూ లేక సతమత మౌతున్నాడు.

గతరాత్రి ఉన్న ఇద్దరు పాసింజర్లూ గదులు ఖాళీచేసి ఇంతకుముందే వెళ్ళారు. ఉదయం ఎవరో ఒకాయన దిగాడు, మిగతా తొమ్మిది గదులూ ఖాళీ! పనివాళ్ళకు జీతా లివ్వట మెలా? ఇంటి అద్దె కట్టట మెలా? నూటికి నాలుగేసి రూపాయిల వడ్డీలు చెల్లించట మెలా? ఎలక్ట్రిక్ బిల్లులు కట్టట మెలా? అంతా అగమ్యగోచరం-అంధకారం!

తొమ్మిదిన్నర ప్రాంతాల ఎవరో ఐదుగురు వచ్చారు.

"రూములు ఖాళీ ఉన్నాయ్యా?" అన్నారు.

సభాపతి మొహం సూర్యకిరణాలు సోకిన పద్మంవలె వికసించింది. గౌరవసూచకంగా లేచి నిలబడి "ఎన్ని రూములు సార్?" అన్నాడు.

"రెండు.... లేదా, మూడు!"

"ఉన్నయ్యండీ...."

"సామాను కారులో ఉంది—"

"ఒరేయ్! సీనుగా!.... సీనుగా!" అని గావుకేకలు పెట్టాడు సభాపతి.

ఆ పాత కట్టడమైతే ఆ అరుపులకు దద్దరిల్లింది కాని, సీనుగాడి దర్శనం మాత్రం కాలేదు.

కప్పులెత్తేవాణ్ని ఒకణ్ని మేడమీదికి తరిమాడు సభాపతి. కాస్సేపట్లో వాడొచ్చి "అక్కడలేడు సార్!" అన్నాడు.

ఈ వచ్చినవాళ్ళు కాస్తా వెళ్ళిపోతారేమోనని ఒకపక్క భయం. సామానులు పైకి తీసుకొచ్చే పని కప్పులెత్తేవాడికి అప్పగించి సభాపతి స్వయంగా పైకి వెళ్ళాడు.

పైన మూడు గదులకు తాళాలు తీసి, రాబొయ్యే పాసింజర్ల కోసం కాచుకొని ఉన్నాడు సభాపతి. పక్క రూమ్‌కు తాళంలేదు. లోపల ఫాన్ తిరుగుతోంది. ఉన్న ఒక్క పాసింజరూ ఉన్న రూమ్ అది కాదు. మరేమిటీ చిత్రం?

సభాపతి కిటికీ పైభాగం మీదినుంచి చూశాడు. లోపల పందిరి మంచంమీది పరుపుమీద రెండుచేతులూ గుండెలమీద వేసుకొని ఫాన్ ఫుల్‌గా వేసుకొని సీనుగాడు సుఖనిద్రలో ఉన్నాడు!

ఉదయం పదిగంటల ప్రాంతాల వీడికి నిద్రా? అందులో, అద్దెల కిచ్చే గదుల్ని ఆక్రమించి, పాసింజర్లు పడుకునే పరుపులమీద ఫాన్ కూడా వేసుకొని-ధూత్! ఈ బ్లడీబగ్గర్‌గాణ్ని ఏం చేయాలి? పాసింజర్లకు యీ సంగతి తెలుస్తే తన హోటల్‌కు ఎంత అపకీర్తి! అసలే వ్యాపారం పరమ మందకొడిగా ఉన్న సమయంలో యీ సీనుగాడి ప్రవర్తన ఇదా!

తలుపు బద్దలయేట్లు కొడుతూ, "ఒరేయ్! సీనుగా! పీనుగా!" అని గోలగోలగా అరిచాడు సభాపతి.

సీనుగాడు అదిరిపడి లేచాడు. కళ్ళు నులుపుకొని చుట్టూ చూశాడు. కలతనిద్రలో వాడికేం అర్థం కావటంలేదు.

"ఒరేయ్! తియ్యరా-తలుపు!" అని సభాపతి ఘీంకరించాడు.

కంఠస్వరం విని సీనుగాడు వొణికిపొయ్యాడు.

కంపించే చేతులతోనే తలుపు తెరిచాడు; ఎదురుగా కళ్ళనుంచి నిప్పులు రాలుస్తూ నిలబడిన యజమానిని చూడగానే వాడికి మృత్యుదేవతను చూసినంత భయం వేసింది. నోట మాటరాక చేతులు రెండూ జోడించి ముందుకు వొంగాడు.

"హుఁ. ఇదన్నమాట నీవు చేసే పని! వెధవా! ఇక దయచెయ్యి-ఫో-ఇంటికి-మళ్ళీ ఇటు వచ్చావంటే ఎముకలు విరగబొడుస్తాను!"

విచారణ జరిగి శిక్ష చెప్పినప్పుడు నేరస్థుని మనస్తత్వం, భయం, క్షోభ సీనుగాణ్ని ఆవరించినవి.

"అయ్యా! తప్పు జరిగింది-క్షమించండి.....ఇకముందు—"

"ముందూలేదు-వెనకాలేదు. మర్యాదగా ఫో-ఇంకేమైనా మాట్లాడావంటే తంతాను!" అని గదిమాడు సభాపతి.

ఇంతలో సామానుల్తో పాసింజర్లు వచ్చారు. రూములు చూసి వాళ్ళు మెచ్చుకోలేదు; మరొకచోటికి వెళ్ళే ఓపిక లేక - మూడు రూములూ తీసుకున్నారు. కాస్త వ్యాపారమైనందుకు సభాపతి సంతోషించాడు.

సీనుగాడి సంగతే మరిచిపోయి సభాపతి కిందికి వెళ్ళాడు. కాష్‌బల్ల దగ్గిర కూర్చున్నాక కాని సీనుగాడు తనను వెంబడించి కిందికి వచ్చాడని తెలుసుకోలేకపోయాడు. వాణ్ని చూడగానే చిరచిరలాడుతూ-"పోరా వెధవా! తిండికి తిమ్మరాజువి!" అన్నాడు.

పైన వచ్చిన పాసింజెర్లకు చాకిరీ చేసేందుకు ఈ సీనుగాణ్ని ఉద్యోగంలోంచి తీసివేశాడు కనుక, మరొకణ్ని పంపవలసిన బాధ్యత సభాపతికి గుర్తొచ్చింది. కప్పులు కడిగేవాళ్ళలో ఒకణ్ని పైకి పంపాడు.

సీనుగాడు అక్కణ్నుంచి కదలలేదు. ఒక పక్కకు ఒత్తిగిలి నిలబడ్డాడు.

"నీక్కాదురా చెప్పేది? కడుపుకు అన్నం తినటంలా? దర్జాగా పరుపుల మీద పడుకుందామని వచ్చావా? పోరా!"

"తప్పు....క్షమించండి" అని ప్రాధేయపడుతున్నాడు సీనుగాడు.

కాస్త జనం వస్తున్న సమయ మది. వీడితో వాదిస్తూ కూర్చుంటే రూపాయినోటుకు పొరపాటున పదిరూపాయిల చిల్లర ఇవ్వవచ్చు. అదీగాక ఏదన్నా ఫలహారం చేద్దామని వచ్చే జనం యీ న్యూసెన్స్‌ను భరించలేక వెళ్ళిపోవచ్చు. వీడా-ఒకపట్టాన వదిలేట్లు లేడు.

"పోరా బాబూ!"

"అయ్యా! మీకాళ్ళు పట్టుకుంటాను-నన్ను రక్షించండి-" అంటున్నాడు సీనుగాడు దీనంగా.

ధోరణి మార్చుకుంటే ప్రయోజనం లేదని తెలుసుకుంటున్నాడు సభాపతి.

"తప్పు చేసినందుకు చెప్పు తీసుకొని కొట్టండి. మొహాన ఉమ్మేయండి. తిట్టండి; నెత్తురొచ్చేదాకా కొట్టండి....కాని కడుపుమీద కొట్టకండి. మీ కాళ్ళు పట్టుకుంటాను-" అని సీనుగాడు సభాపతి కాళ్ళవైపు వొంగబొయ్యాడు.

సభాపతి వాణ్ని వారించి-

"అరేయ్ సీనుగా! నీ ఉద్యోగం తీసివేశాను. ఇప్పుడు నీవు ఏం చెప్పినా నేను వినిపించుకోను. నాలుగురోజు లయ్యాక కనిపించు-అప్పటికేమైనా మనస్సు మారుతుందేమో చూస్తాను—"అన్నాడు కంఠస్వరంలోని తీవ్రత తగ్గించి.

"అంటే గురువారం రమ్మంటారా?" అన్నాడు సీనుగాడు ఆశాపూర్వకంగా.

సభాపతి చికాకుగా "ఊఁ" అని మూలిగాడు.

"పొద్దున్నే వస్తాను" అన్నాడు సీనుగాడు.

"చావు—చూద్దాం!" అన్నాడు సభాపతి యదాలాపంగా.

మరో పనివాడు 'విసిగించక, ఇప్పుడు పోరా' అన్న ధోరణిలో సీనుగాడికి సౌజ్ఞ చేశాడు.

సీనుగాడు మరోసారి వంగి నమస్కారం చేసి వెళ్ళిపొయ్యాడు- చచ్చేందుక్కాదు; గురువారంనాడు వచ్చేందుకు! ప్రస్తుతానికి యీ పీడ వదిలించుకోగలిగి నందుకు సభాపతి మనసు తేలికైనట్లు నిట్టూర్చాడు.

# 3

రాత్రి మూడింటికి సభాపతికి మెలకువ వచ్చింది. చంటిది గుక్క తిరక్కుండా ఏడుస్తోంది. కల్యాణమండపంలో తనను భర్తగా స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్న ఆడపిల్ల మెడలో మూడుముళ్ళూ గట్టిగా బిగించి మంగళ సూత్రాన్ని కడుతున్నానని తాను పొరబడ్డాడు; ఎందుకంటే ఆ బిగించి కట్టింది మంగళసూత్రం కాదు. తన మెడకు వేసుకున్న ఉరి అనే విషయం నసాళానికి అంటేవిధంగా ఇప్పుడు అర్థమైంది.

ఉదయం ఏడునుంచీ రాత్రి పదిగంటలదాకా హోటల్ వ్యవహారాలు చూచుకొని మనసెంతో చీకాకుపడగా, వాళ్ళు హూనం హూనం కాగా కొంప జేరుతే-చచ్చాక వేరొక నరకం ఎలా వుంటుందో ఇక్కడే చవిచూడవలసి వస్తోంది. ఇప్పుడు కన్ను మూస్తే మరి మెలకువ రాదు. అందుకని నిద్రలో మరిచిపోయిన ఆలోచనలు శవంమీద వాలే రాబందుల గుంపల్లే ఎగిరెగిరి వాడి గోళ్ళతో తన్నుకుంటూ రాసాగినవి.

విసుక్కుంటూ. తిట్టుకుంటూ నానా అవస్థా పడి-భార్య, పిల్లదాన్ని సముదాయించింది. పెద్ద గాలి వాన తగ్గిపోయినప్పుడే అంతమయే ఆవేదన లాటిదాన్ని సభాపతి అనుభవించాడు.

తెల్లారుతే గురువారం-అంటే మార్వాడీకి రెండువందల రూపాయల వడ్డీ చెల్లించాలి. రోజంతా అమ్మగా వందవరకూ కలెక్షన్ ఉంటుంది; భార్య నగలన్నీ యీవరకే తాకట్టులో ఉన్నవి. మార్వాడీ అసలుకోసం కూడా గొడవ చేస్తున్నాడు; కోర్టుకు వెళ్తానని బెదిరిస్తున్నాడు. కోర్టుద్వారా హోటల్ అమ్మకం జరుగుతే తనకు మిగిలేదేమీ ఉండదు. ఇంకెవరికైనా అమ్మాలంటే సవాలక్ష ప్రశ్నలు. కొనేవాడిదగ్గిర డబ్బుండాలే కాని, ఇంత కన్న మంచి హోటళ్ళు దొరక్కపోవు. ఏదో అత్యద్భుతం జరుగుతే, యే దైవశక్తులో అడ్డుపడితే తప్ప తనను రక్షించటం యెవరివల్లా అయేదికాదు.

గురువారమంటే-సీనుగాడు ఉదయాన్నే దర్శనమిచ్చే రోజనే విషయం కూడా గుర్తుకొస్తోంది. ఆ కోపంమీద సీనుగాణ్ని తరిమేశాడు కాని, వాడు లేనిలోటు యీ నాలుగురోజులూ కనిపిస్తూనే ఉన్నది. చిన్న తప్పుకు పెద్ద శిక్ష వేశా ననుకున్నాడు. యీసారి వా డొస్తే మరికొన్ని చివాట్లు పెట్టి పనిలోకి రమ్మంటే బాగుండునని నిశ్చయించుకున్నాడు.

చిన్నది తేలుకుట్టిన విధంగా తిరిగి ఏడుపు లంకించుకుంది. ఇక్కడ యీ ఆవేదన పడటంకన్న—ఒక గంట ముందైతే ఐంది, అట్లా రోడ్డు మీదికి వెళ్ళిపోతే యీ నరకంనుంచి తాత్కాలికంగా విముక్తి లభిస్తుంది. ఈ ఆలోచనతో సభాపతి చకచకా కాలకృత్యాలు తీర్చుకొని భుజాన కండువా వేసుకొన్ని బైటపడ్డాడు.

హోటల్‌కు వెళ్ళేప్పటికి ఆరుంబా వయింది; మరో ముప్పావుగంట కల్లా వ్యాపారం ఆరంభమౌతుంది. ఏదెలా చచ్చినా కనీసం తాను సుఖం గాన్నా ఉంటే ఫర్వాలేదు. తనను సుఖపెట్ట లేనిది ఏదీ ఉండీ ప్రయోజనం లేదు.

పనివాళ్ళను నిద్రలనుంచి లేపాడు. అరగంటసేపు ఏవేవో పిచ్చి పిచ్చి ఆలోచనల్తో గడిపి-వేడి వేడి ఇడ్లీ, ఉప్మా, కాఫీలు చవిచూసి, తలుపులు తెరిచి-రాబొయ్యే కాతాదారులకు స్వాగతం చెపుతున్న ధోరణిలో రోడ్డుమీదికి నాలుగైదుసార్లు తొంగి చూశాడు.

ఒకళ్ళిద్దరుగా జనం వస్తున్నారు. ఏడు గంటలు దాటాక కాని కాస్త రష్ కనిపించదు. ఎర్ర సైకిల్‌మీద టెలిగ్రాం బంట్రోతు దిగాడు. కాఫీ సేవించేందుకు వచ్చి ఉంటాడు లెమ్మని సభాపతి అనుకున్నాడు. కాని ఆ బంట్రోతు సరాసరి టేబిల్‌దగ్గరికి వచ్చి, "టెలిగ్రామ్ సార్!" అని ఒక కవరు అక్కడ పడేసి కాగితం మీద సంతకం చేయవలసిన తావు చూపాడు. తన కెవరా టెలిగ్రామ్ ఇచ్చారు? సభాపతి అదిరిపోయి కాస్త వొణుకుపుట్టిన చేతితో సంతకం చేసి టెలిగ్రామ్ బంట్రోతు బాధ వదుల్చుకున్నాడు. బంట్రోతు కాఫీ తాగుతాడేమోనని కాస్త గమనించి, అతను వెళ్ళిపోవటం చూసి టెలిగ్రామ్‌మీదికి దృష్టి సారించాడు.

మార్వాడీవాడు టెలిగ్రామ్ నోటీ సేమన్నా ఇచ్చాడేమో? భయపడు

తూనే సభాపతి టెలిగ్రామ్ విప్పాడు: 'స్వీప్—ఫస్ట్‌ప్రైజ్—వన్‌లాక్—యువర్స్—' అని ఉన్నది. తా నెప్పుడూ లాటరీ టిక్కెట్లు కొనలేదు. ఎవరిదో తనకు తప్పుగా డెలివరీ ఐనదేమోనని పైన చూస్తే 'శ్రీనివాసులు—సభాపతీ భవన్—ట్రంక్‌రోడ్—' అని ఉన్నది; టెలిగ్రామ్ ఎక్స్‌ప్రెస్!

క్షణంలో సీనుగాడు—అత్యల్పుడల్లా—సభాపతి దృష్టిలో - ఆ మాట కొస్తే సమాజపు దృష్టిలోనే అత్యధికు డయ్యాడు; ఆ 'శ్రీనివాసులు గారు' తన తలతన్ని శిఖరాగ్రాన ఉన్నాడు; తా నో కింది లోయలో మట్టిలో దొళ్ళాడుతూన్నాడు!

కొద్ది క్షణాలవరకూ సభాపతి నిశ్చేష్టు డయ్యాడు. ఇంకాస్సేపటికి శ్రీనివాసులు రానే వస్తాడు. వాడు లక్షాధికారి-తాను భిక్షాధికారిత్వం స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నాడు. ఏదో గొప్ప అత్యద్భుతం-మిరకిల్ జరుగుతే బాగుండునని రాత్రినుంచీ సభాపతి మనస్సు పీకుతోంది. అదిప్పుడు జరగనే జరిగింది. దాంతో ఓడలు బళ్ళయి, బళ్ళు ఓడలుగా మారేంత వరకూ వచ్చింది.

ఇప్పుడు తనను నిజంగా ఉద్ధరించగల ఏకైక వ్యక్తి - తాను ఉద్యోగంనుంచి తీసివేసి, తిరిగి ఉద్యోగం ఇచ్చే విషయం ఆలోచించి చెప్పేందుకు ఇవాళ రమ్మన్న సీనుగాడు-తప్పు-తప్పు-శ్రీ శ్రీనివాసులు! వాణ్ని ఆశ్రయించట మొక్కటే తనకు దిక్కు! వాడు త్వరగా వస్తే-గుండె పగిలి చావకుండా మెల్లిగా అసలు విషయం చెప్పి, తనను రక్షించమని వేడుకోవాలి!

సభాపతి మనస్సులో యీ విచిత్రాన్ని గూర్చిన వివిధ సంఘటనల తాలూకు టెక్నికలర్ సినిమా రీళ్ళు పరిభ్రమిస్తున్నవి. దాదాపు మతిపోయి నట్లయి - ఆ సీనుగాడి కోసం వేయి కళ్ళతో యెదురుతెన్నులు చూడ సాగాడు.

ఏడు గంటల ప్రాంతాల అల్లంత దూరాన సైంధవుడి తలకాయ సూర్యాస్తమయ సమయాన పైకి లేచిన విధంగా-శ్రీనివాసులు చింపిరి తల కాయ తాలూకు ఔట్‌లైన్ కనిపించింది. మరుక్షణంలో వాడి తలకాయ

మొత్తం-చీకి పారేసిన తాటి పండును గుర్తుకుతెస్తూ దర్శనమిచ్చింది. ఐతే వాడి ముఖారవిందాన్ని చూసిన సభాపతికి-చీకటిని చీల్చుకుంటూ ఉదయించే ఉదయభానుడు గుర్తుకు వచ్చాడు. తనను రక్షించేందుకు అవతరించిన యుగపురుషుడే తనకు వరాల నిచ్చేందుకు కరుణించి మందగమనాన వస్తు న్నట్లు తోచింది సభాపతికి.

వాడు దగ్గరవుతూన్నకొద్దీ సభాపతి క్రమంగా కుర్చీలోంచి లేచి నిల బడి-హోటల్ ముందుకు వచ్చే సమయానికి ఎదురు వెళ్ళాడు. యజమాని కోపంతో తనను కొట్టేందుకు వస్తూన్నట్లు తోచింది సీనుగాడికి. మొదట్లో భయపడి పారిపోదా మనుకున్నాడు కాని, ఉద్యోగంలేని బతుక్కు మరీ భయ పడి అయేదేమో అవుతుందని మొండికేసి నేలకు పాతుకుపోయినట్లు నిలబడి పోయాడు. నాలుగు తిట్లు తిన్నా, కొన్ని తన్నులు తగిలినా భూమిమీద నూకల ప్రాప్తి ఉంటే చాలునని వాడి అంచనా! 'దాసుడి తప్పు దండంతో సరి' అన్న విధంగా కొంతలో కొంత తీవ్రతన్నా తగ్గుతుందేమోననే ఆశతో సీనుగాడు దణ్ణం పెడుతూ నిలబడి పొయ్యాడు.

సభాపతి సరాసరి వాడి దగ్గరకొచ్చి వాణ్ణి కావిలించుకొని—"శ్రీని వాసులూ! నన్ను క్షమించు!" అన్నాడు. 'సీనుగా' అననందుకే వాడు ఆశ్చర్యపడుతూంటే—ఆ రెండోమాట వినేప్పటికి తన చెవులను తానే నమ్మలేక పొయ్యాడు.

"అయ్యా! అంతంత మాట లనకండి....నాకు తిరిగి ఉద్యోగం ఇస్తే మీ పాదాలదగ్గిర పడివుండి బతుకుతాను!" అన్నాడు—ఏ భగవంతుడో కలలో కనిపించి తనను క్షమించమని ఆదేశించి ఉంటాడని భ్రమపడుతూ, ఇలాటి అద్భుతం-మిరకిల్-లాటిది జరిగి, తనకు తిరిగి యీ ఉదోగ్యం వస్తుం దని వాడు యీ మూడు నిద్రలలోనూ కలలు కన్నాడు.

"శ్రీనివాసులూ! నీవే నన్ను రక్షించాలి—"

"అయ్యగారూ! చాలా చిత్రంగా మూట్లాడుతున్నారు—" అన్నాడు సీనుగాడు నివ్వెరబోయి.

"నాకు సహాయం చేసే అవకాశం నీకు లభిస్తే, తప్పక సహాయ పడతానని వాగ్దానం చేస్తావా?"

"తప్పకుండా—" అన్నాడు సీనుగాడు వెకిలి నవ్వు నవ్వుతూ.

"శ్రీనివాసులూ! నీకు లాటరీలో చాలా డబ్బు వచ్చింది—" అన్నాడు సభాపతి. ఎంతో చెపితే వాడు షాక్ తింటాడేమోనని.

"ఎంత వచ్చింది అయ్యగారూ? నాలుగు లక్షలు వొచ్చిందా?" అన్నాడు సీనుగాడు.

లక్ష రూపాయలంటే వీడి దృష్టిలో యెంతో సభాపతికి తెలియలేదు. నాలుగు లక్షలు వొచ్చి ఉంటుందని భావించేవాడికి ఒక లక్ష వచ్చిందంటే షాక్ తినవలసిన పనిలేదు.

అందుకని, "ఒక లక్షరూపాయలు వొచ్చింది-శ్రీనివాసులూ! లక్షంటే—వంద వేలు; వేయి అంటే పది వందలు!" అన్నాడు సభాపతి వివరంగా చెపుతూ.

ఇప్పుడు సీనుగాడు నిజంగానే షాక్ తిన్నాడు. నెత్తిమీద పెద్ద దెబ్బ తగిలినట్లు దిమ్మెర పొయ్యాడు. కింద పడిపోతాడేమోనని సభాపతి వాణ్ని పట్టుకున్నాడు.

అంత ప్రమాదం జరక్కుండానే క్షణంలో వాడు తేరుకున్నాడు.

"నిజంగానే అయ్యగారూ! నాతో వేళాకోళాలు ఆడుతున్నారా?" అన్నాడు సీనుగాడు.

"నిజంగానే! టెలిగ్రామ్‌కూడా వచ్చింది....ముందు కాస్త కాఫీ తాగు. ఆ తరువాత మాట్లాడుకుందాం—" అన్నాడు సభాపతి.

సీనుగాణ్ణి సగౌరవంగా తీసుకొచ్చి ఆశీనుణ్ణిచేసి సభాపతి స్వహస్తాలతో టిఫిన్ కాఫీలు సర్వ్‌చేశాడు. ఈ సమయానికి అసలు విషయం తెలిసిపోయి నందువల్ల లక్షాధికారి శ్రీనివాసులు మీద తోటి పనివాళ్ళందరికీ ఎంతో గౌరవం, భయభక్తులు ఏర్పడినవి.

సభాపతి టెలిగ్రామ్ అందించాడు; ఇది ఇంగ్లీషులో ఉండటంవల్ల ఠీవిగా ఒకసారి దాన్ని చూసి, సీనుగాడు జేబులో పెట్టుకున్నాడు. లక్షాధికారి లక్షణాలు అప్పుడే వీడిలో పొడసూపిన వనే విషయాన్ని సభాపతి గ్రహించాడు.

ఆ తరువాత సీనుగాణ్ణి మేడమీదికి తీసుకొనివెళ్ళి, లోగడ వాడు పడుకొని నిద్రిస్తూండగా చివాట్లువేసి ఉద్యోగం తీసివేసిన గదిలోకే తోడ్కొని వచ్చి, వాణ్ణి మంచంమీద మెత్తని పరుపులమీద కూర్చోబెట్టి తాను నిలబడి సభాపతి తన గోడు చెప్పుకున్నాడు:

"వ్యాపారం ఏమీ బాగాలేదు. ఈ హోటల్‌ను మీరు కొని, అభివృద్ధి చేస్తే బాగుంటుంది. మిమ్ము భాగస్వామిగా రమ్మనికూడా కోరలేను. ఎందుకంటే మీతోపాటు నేను పెట్టుబడి పెట్టలేను కనుక....నన్ను మేనేజర్‌గా-పోనీ అదీ ఇష్టంలేకుంటే సర్వర్లమీద సూపర్‌వైజర్‌గా ఉద్యోగం ఇమ్మని ప్రార్థన—"

'మీరు' అని తనను ఈ ప్రపంచంలో సంబోధించటం ఇదే మొదలు. తన దగ్గర లక్షరూపాయిలూ ఉన్నంతకాలం, లేదా ఉన్నదని ప్రజలు భావించినంత కాలం ఈ ప్రపంచానికి తాను 'మీరు' గానే ఉండి పోతా ననే స్వల్ప విషయం సీనుగాడికి తెలిసివచ్చింది.

"నాలుగురోజు లయ్యాక కనిపించు-ఆలోచిద్దాం!" అన్నాడు సీనుగాడు ఠీవిగా. డబ్బుతోపాటే హుందాతనం కూడా వచ్చిపడుతుంది కాబోలు!

"చిత్తం—ఆదివారంనాడు తమను ఇంటిదగ్గర దర్శనం చేసుకుంటాను—" అన్నాడు సభాపతి, లోపల అంతరాత్మ అఘోరిస్తూన్నా, లక్షాధికారి తీవ్రమైన దృష్టికి లొంగిపోయి.

"ఊఁ—"

"ఉదయం కనిపిస్తాను—"

"సరే—" అని సీనుగాడు లేచి నిలబడ్డాడు. హుందాగా అడుగులు వేస్తూ, దృష్టిని ఆకాశంమీద నిలిపి దర్జాగా ఇంటికి వెళ్ళాడు.

నాలుగురోజు లయ్యాక 'సభాపతీ భవన్' 'శ్రీ శ్రీనివాసా లంచ్ హోమ్'గా మారటం, సీనుగాడు దానికి యజమాని కావటం, సభాపతి మేనేజర్‌గా నియమించబడటం జరిగింది.

—మార్చి, 1963.